క్లుప్తంగా

ప్రతి ఇంటికి ధర్మ ప్రచారం

బి.కొత్తకోట: హిందూ ధర్మాన్ని ప్రతిఇంటికి తీసుకెళ్లి ప్రచారం నిర్వస్తున్నామని సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర ధర్మప్రచారక్ ముద్ద సాయిరాం అన్నారు. ఆదివారం బి.కొత్తకోట జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో హిందూ ధార్మిక సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ ఎనిమిదేళ్లగా ఫౌండేషన్ గ్రామాల్లో భజన సత్సంగం సంకీర్తన, సామూహిక హారతి కార్యక్రమాలను నిర్వస్తూ హిందువుల్లో చైతన్యం తీసుకొస్తున్నట్లు చెప్పారు. గీతాశ్రమం చిదానందగి స్వామి మాట్లాడుతూ హిందూ ధర్మ సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను వివరించారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు

ములకలచెరువు: పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత జనసేన మదనపల్లి ఇన్‌చార్జి రాందాస్ చౌదరికి లేదని తంబళ్ళపల్లి నియోజకవర్గ బీసీ నాయకుడు సురేంద్రగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 50 ఏళ్ళ చరిత్రలో తంబళ్ళపల్లి నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసిన ఘనత పెద్దిరెడ్డి కుటుంబానికే దక్కిందని ధీమా వ్యక్తం చేశారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవని వారంతా పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే చర్యలు

ములకలచెరువు: పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను తరలించినా, ఇష్టారాజ్యంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్‌ఐ భాస్కర్ నాయక్ అన్నారు. ఆదివారం ఆయన తంబళ్ళపల్లి క్రాస్‌రోడ్డులో నాకాబందీ నిర్వహించి అధిక సంఖ్యలో ఆటోల్లో ప్రయాణికులను తరలిస్తున్న వారికి జరిమానా విధించారు.

అరుణాచలానికి ఆరు ప్రత్యేక బస్సులు

పీలేరు రూరల్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అరుణాచలం మహాదీపం వీక్షణకు పీలేరు నుంచి ఆరు ప్రత్యేక బస్సులు తరలివెళ్లాయి. ఆదివారం ఉదయం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం కుమార్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం సురక్షిత ప్రయాణం కొరకు ప్రత్యేక బస్సు సర్వీసులు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్‌స్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, బాబు నాయక్, రమణ, ఆనంద్ పాల్గొన్నారు.

కేబుల్ వైర్ చోరీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లి పరిసర వ్యవసాయ పొలాల్లో రైతుల బోర్లకు అమర్చిన కేబుల్ వైరు చోరీకి గురైందని బాధిత రైతులు ఆదివారం పేర్కొన్నారు. గుర్తు తెలియని దుండగులు చాకచక్యంగా కేబుల్‌ను కత్తిరించుకెళ్ళారని రైతులు మస్తాన్, గోపాలక్రిష్ణ, మహబూబ్‌పీర్, నన్నేసాబ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎన్‌ఎంఎంఎస్ నమూనా పరీక్షకు 300 మంది హాజరు

మదనపల్లె సిటీ: నేషనల్ మెరిట్ కం మీన్స్ నమూనా పరీక్షకు 300 మంది విద్యార్థులు హాజరైనట్లుల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుబ్బారెడ్డి తెలిపారు. డిసెంబర్ 3న జరగనున్న ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు గత నెల రోజులుగా ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఆదివారం పాఠశాలలో నమూనా పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజారెడ్డి, వరప్రసాద్, శ్రీనివాసులు రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డిలు హాజరయ్యారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం



మాట్లాడుతున్న శంకరయ్య

వాల్మీకిపురం: విశ్రాంత ఉద్యోగులంతా కలసికట్టుగా ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకుందామని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శంకరయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని కొత్తపేటవీధిలో ఏర్పాటు చేసిన తాలూకా విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై ఉమ్మడి పోరాటం చేస్తామన్నారు. మన సంఘంలో ఎవ్వరికైనా సమస్యలు తలెత్తితే, ఆ సమస్యలను విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం పని చేస్తోందన్నారు. సంఘంలో సభ్యులకు ఏ సమస్యలున్నా సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు.

ఆటో ఢీకొని అక్క, తమ్ముడికి తీవ్ర గాయాలు

నిమ్మనపల్లె : ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనడంతో అక్క, తమ్ముడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. వెంగలవారి కురవపల్లెకు చెందిన రమణ భార్య టి.సుజాత (25), తన తమ్ముడు గోపీకృష్ణ (19)తో కలిసి ద్విచక్ర వాహనంలో సొంత పనులపై చింతపర్తికి బయలుదేరారు. మార్గమధ్యంలోని అగ్రహారం పంచాయతీ తరిగొండవారిపల్లె వద్ద, ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో సుజాత, గోపీకృష్ణ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

మదనపల్లె సిటీ: కార్తీక పౌర్ణమి సందర్భంగా శివాలయాలు దీపాల వెలుగులతో నిండిపోయాయి. ఆలయాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం స్థానిక సీటీఎం రోడ్డులోని మంజునాథస్వామి ఆలయంలో మహిళలు ఆలయం ఎదుట దీపాలు వెలిగించారు. దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో దీపాల వెలుగులతో సోమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని యోగభోగేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం స్వామి ధ్వజస్తంభం ఎదుట జ్వాలాతోరణం వెలిగించారు. భక్తులు జ్వాలాతోరణం దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక బీటీ కళాశాల మైదానం వద్దనున్న వరాల ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ ప్రాంగణంలో దీపాలతో అలంకరించారు.సీటీఎంలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి స్వామిని దర్శనం చేసుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలోని ఉసిరిచెట్టు వద్ద దీపాలు పెట్టారు.



కలికిరి: ఆలయ ఆవరణలో దీపారాధన చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు

వాల్మీకిపురం: మండలంలోని పాతమంచూరు శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం కార్తీక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు, వడమాల సేవ, అర్చన, పంచామృతాభిషేకం, తదితర కార్యక్రమాలు నిర్వహించి, మహా శివ కోటి యజ్ఞం నిర్వహించారు. అలాగే జ్వాలా దీపాలంకరణ, సహస్ర దీపాలంకరణ, ఆకాశదీపం, ఐదు వేల దీపాలతో అలంకరణ గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పూజారి రామక్రిష్ణ, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై కార్తీక పౌర్ణమి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలిసిన భమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భక్తులు సూర్యుడు ఉదయించక ముందే కొండపైకి చేరుకున్నారు. సూర్యకిరణాలు స్వామి శివలింగాన్ని తాకాయి. సూర్యకిరణాల వెలుగులో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మొదటిసారిగా మల్లయ్యకొండకు గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు బస్సుల్లో మల్లయ్యకొండ, ఇనుముకొండ, సాధుకొండ మూడు కొండలను ప్రదక్షిణ చేసి మల్లయ్యకొండను సందర్శించారు. భజనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్‌రెడ్డి, సభ్యులు ప్రభాకర్ రెడ్డి, అన్నదానట్రస్టు అధ్యక్షులు రమణారెడ్డి, మెడికల్ నారాయణరెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో..

కలికిరి: పట్టణంలోని పార్వతీ సమేమ సోమేశ్వరాలయంలో ఆదివారం కార్తీక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు, కార్తీక దీపోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అర్చన, అభిషేకం, విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. సాయంకాలం ఆలయ ఆవరణలో కార్తీక దీపోత్సవం నిర్వహించారు. మహిళలు ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం చేశారు.

దివ్యతేజంగా కార్తీక దీపం

కలకడ : భక్తులకు దివ్వ తేజంగా కార్తీక దీపం దర్శనమిచ్చింది. ఆదివారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని ఝరికోన, కోన పంచాయతీ పాతకోన శివాలయాలలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఝరికోనలో భక్తులు దీపాలు వదలి ఓంనమః శివాయ భక్తి గీతాలు ఆలపించారు. సాయంత్రం 4గంటలకు రుద్రాభిషేకం, 6గంటలకు కళ్యాణ మహోత్సవం, దీపారాధన కార్యక్రమాలు నిర్వహించారు.






మదనపల్లె సిటీ: దీపాలు వెలిగిస్తున్న భక్తులు, వాల్మీకిపురం: విశేష అలంకరణలో ఆంజనేయస్వామి, తంబళ్లపల్లె: గిరిప్రదక్షిణకు బయలుదేరుతున్న భక్తులు, కలికిరి: విశేష అలంకరణలో సోమేశ్వరస్వామి

విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే చేయూత



నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఇటీవల కమ్మచెరువులో పర్యటించగా డాక్టర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు సహకారం అందించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరారు. ఈ నేపథ్యంలో ఆదివారం సర్పంచ్ చెరువు నరసమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటసుబ్బారెడ్డి, ఎస్సీ నాయకుడు కేవీ రమణ, కాలనీ కమిటి సభ్యుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విగ్రహ ఏర్పాటుకు రూ.50 వేల నగదును అందజేశారు.

నేడు నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో లక్షదీపారాధన

నిమ్మనపల్లె: మదనపల్లె నియోజకవర్గంలోని ప్రసిద్ధ శివాలయం, యోగభూమి తవళం శ్రీ నేలమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం లక్షదీపారాధన, రాత్రి 8గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ తాత్కాలిక కమిటీ సభ్యులు గోపాలకృష్ణ తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ ప్రాంగణంలో దీపాలు వెలిగిస్తారన్నారు. ఉదయం కేదారేశ్వర స్వామి వ్రత ఆచరణతో పాటు స్వామివారికి విశేష పూజలు,అలంకరణలు ఉంటుందన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యం కోసం మదనపల్లెటు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు లక్ష దీపారాధన, కళ్యాణ మహోత్సవానికి హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వైభవంగా ప్రణవ ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ట

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో ఆదివారం వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రణవ ధ్వజస్తంభ ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా 43 మంది దేవతామూర్తులు గల 32 అడుగులు ఎత్తుగల ప్రణవ ధ్వజస్తంభంలోని శ్రీ గురుదక్షిణామూర్తి, గురు దత్తాత్రేయ, కాలభైరవ, శ్రీ వీరభద్ర స్వాములకు విశేష పూజలు నిర్వహించారు. షిరిడి సాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నవచండీ యాగం, నక్షత్రిష్టి యాగం, దశశాంతి హోమాలు, కుంభ సంరక్షణ, దశశాంతి హోమాలు, నవగ్రహ హోమాలు, సుందరకాండ హోమం నిర్వహించారు. అనంతరం భక్తులు ధ్వజస్తంభ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

దేశ సేవకు చక్కని వేదిక ఎన్‌సీసీ

కురబలకోట: దేశ సేవకు చక్కని వేదికగా ఎన్‌సీసీ యని అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సి.కమాల్ బాషా అన్నారు. ఆదివారం 75వ ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ ఐక్యత, క్రమశిక్షణను నేర్పిస్తుందన్నారు.సేవా దృక్పధాన్ని పెంపొందిస్తుందన్నారు. ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దేందుకు దోహదపడుతుందన్నారు. అత్యవసర సమయాల్లో సేవలు అందించడానికి సిద్ధంగా ఉంటుందన్నారు. లెఫ్టినెంట్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ బీటీ కాలేజీలో ఆదివారం ఎన్‌సీసీ డే ఘనంగా నిర్వహించారు. చిత్తూరు 35వ బెటాలియన్ ఆధ్వర్యంలో కాలేజీలో ఎన్‌సీసీ డే చేశారు. కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై కేడెట్లచే గార్డ్ ఆఫ్ హానర్ తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ అనేది విద్యార్థులకు శారీరక ధారుఢ్యాన్ని, మానసిక స్థైర్యాన్ని ఇస్తుందన్నారు. దేశసేవ చేసే అవకాశం కల్పిస్తుందని, అందువల్ల అవకాశం వస్తే విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం కాలేజీ ఆవరణంలో మొక్కలు నాటారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

రెడ్డెమ్మతల్లీ.. కరుణించి కాపాడమ్మా

గుర్రంకొండ: రెడ్డెమ్మతల్లీ కరుణించి కాపాడమ్మా అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి మొక్కుకొన్నారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తుల సందడి మొదలైంది. అమ్మవారి ఎదుట సంతాన కోసం భక్తులు వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. ఆలయ మెట్లకు పసుపుకుంకుమలు,కర్పూర హారతులతో పూజలు చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయినులు

పీలేరురూరల్ : చిత్తూరు జిల్లా అరగొండ ఇషా విద్యానికేత్ ప్రాంగణంలో జరిగిని రాష్ట్ర స్థాయి క్రీడల్లో స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ జి. బేబి కరుణ తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థినులు ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, షూటింగ్ బాల్, కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ తోపాటు పీఈటీ సుజాత, ఉపాధ్యాయినీలు పుష్పలత, శిరీష, మీనాక్షి, శివలక్ష్మీ, నిరంజని అభినందించారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేద్దాం



సమావేశమైన మానవత సంస్థ సభ్యులు

వాల్మీకిపురం: సమాజంలోని నిరుపేద ప్రజలను ఆదుకునేందుకే మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అందిస్తున్న సేవలను మరింత విస్తృతం చేద్దామని ఆ సంస్థ జిల్లా అధ్యక్షులు క్రిష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక భగవాన్ సత్యసాయి మందిరంలో మానవత సంస్థ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకునేందుకు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ నెలలో 23 సార్లు ఫ్రీజర్ బాక్సులు, 8 సార్లు శాంతి రథం, 4 సార్లు అంబులెన్స్ సర్వీసు ప్రజలకు అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, పివి నారాయణ, నీళ్లభాస్కర్, శంకరయ్య, కుమార్, లక్ష్మీనారాయణ, కోసూరి చంద్రమౌళి పాల్గొన్నారు.

ప్రజాహిత గ్రంథం భారత రాజ్యాంగం

పీలేరు : ప్రజాహిత గ్రంథం భారత రాజ్యాంగమని వక్తలు అన్నారు. ఆదివారం 74వ రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 60 దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులు చాలా కష్టపడి రాజ్యాంగానికి రూపకల్పన చేశారన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ధరణికుమార్, సుభాష్, మల్లికార్జున, అమీరుల్లా, మౌలా, బోదేషా, రమేష్‌నాయక్, కృష్ణయ్య, వెంకటరామలయ్య గట్టప్ప, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాల నాయకులు

ఘనంగా సత్యనారాయణస్వామి వ్రతం

పీలేరు : ఆర్యవైశ్య సంఘం, వాసవీకపుల్స్‌క్లబ్, వాసవీక్లబ్ గ్రేటర్స్ ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం ఘనంగా నిర్వహించారు. ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పలువురు ఆర్యవైశ్య దంపతులు పాల్గొని భక్తి శ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. సాయంత్రం నెల్లిచెట్టుకు పూజ, సాయంత్రం కార్తీక దీపోత్సవం, జ్వాలాతోరణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాల వినియోగం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, వాసవీకపుల్స్‌క్లబ్, వాసవీక్లబ్ గ్రేటర్స్ నాయకులు కూనా సత్యం, సుధీర్, మల్లికార్జున, నాగలక్ష్మీ, సురేష్‌బాబు, నాగరాజ, మహిదర్, అరవింద్, గోవర్ధన్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వ్రతం ఆచరిస్తున్న మహిళలు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మదనపల్లె సిటీ: వారంతా 40 ఏళ్ల కిత్రం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ఎక్కడెక్కో స్థిరపడ్డారు. మిత్రులందరూ కలుసుకోవడానికి పాఠశాలను వేదికగా చేసుకున్నారు. మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1981–82 పదో తరగతి చదివిన పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. అప్పట్లో పాఠశాలలో చదివిన గుర్తులు, పాత స్నేహితులు చేసిన అల్లరి, అప్పట్లో విద్య నేర్పిన గురువులను గురించి పాత జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. జనవరిలో పాఠశాలలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించనున్నట్లు తీర్మానం చేశారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు ఆర్టీసీ డీఎం నిరంజన్, జియావుద్దీన్, పాల్ చంద్రశేఖర్, వేమారెడ్డి, మోజస్, బాబులాల్, శివ పాల్గొన్నారు.



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాజ్యాంగం దేశాన్ని నడిపించే దిక్సూచి

వాల్మీకిపురం: రాజ్యాంగం దేశాన్ని నడిపించే దిక్సూచి అని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు రవి అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గాంధీ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వపు పోటీలు నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నీళ్లభాస్కర్, కిషోర్, వెంకటస్వామి, సుధాకర్, రాయుడు, చికెన్‌మస్తాన్, శంకర, అధ్యాపకులు పెద్దప్పరాజు, నారాయణస్వామి, రాఘవ రెడ్డి, జ్యోతి, నజుముద్దీన్, గురుప్రసాద్, సుబ్రమణ్యం, కృపామై పాల్గొన్నారు.





కేవీపల్లె : అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు, వాల్మీకిపురంలో..., కలికిరి: మాట్లాడుతున్న కమాండెంట్ నీరజ్ కుమార్ పాండే

దేశాన్ని నడిపేది రాజ్యాంగమే

మదనపల్లె: దేశాన్ని అన్ని విధాలుగా ముందుకు నడిపేది భారత రాజ్యాంగమేనని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు యమలా సుదర్శనం అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తిరుపతి పర్యటనలో అడ్డుకుంటామని పేర్కొన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్‌సర్కిల్‌లో అంబేద్కర్ విగ్రహానికి మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల సుదర్శన్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాలమహానాడు నాయకులు చంద్రయ్య, గుండా మనోహర్, మల్లెల మోహన్,లక్ష్మిపతి, రామచంద్ర, రమణ, రమేష్, ఎనుమలవారిపల్లె మోహన తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల అవగాహన

మదనపల్లె సిటీ: భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ అన్నారు. ఆదివారం కాలేజీలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంపై అవగాహన పెంచుకుంటే మానవహక్కులు, చట్టాలపై పట్టు సాధించవచ్చునన్నారు. రాజ్యాంగంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ పాత్రను స్మరించుకుని దేశ రాజ్యాంగ విశిష్టతను కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మోహన్ వల్లి, జ్యోతి, విష్ణుప్రియ, నమ్రత పాల్గొన్నారు. స్థానిక ఆర్టీసీ టు డిపో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

భారత రాజ్యాంగం మహోన్నతమైనది

కేవీపల్లె : డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం మహోన్నతమైనదని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దొడ్డి సురేష్ అన్నారు. అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల కన్వీనర్ గజ్జెల శీనరెడ్డి, నాయకులు ధర్మారెడ్డి, రవిరెడ్డి, ఇమ్రాన్‌ఖాన్, కంబాల హరిబాబు, చంద్ర, అశోక్, సామ్రాట్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అందరికీ రక్ష

బి.కొత్తకోట: భారత రాజ్యాంగం అందరికి రక్షగా నిలుస్తుందని బాస్ జిల్లా కార్యదర్శి సింగన్న అన్నారు. ఆదివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి రాజ్యాంగం ద్వారా సమాన హక్కులు కల్పించబడ్డాయన్నారు. కార్యక్రమంలో బాస్ సీనియర్ నాయకులు సచిన్, కోగర వెంకటేష్, మాధవ, మణి, శ్రీనా, గంగాద్రి, అమర పాల్గొన్నారు.

సీఆర్‌సీఎఫ్ కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం

కలికిరి: కలికిరి సమీపంలోని సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ–3) కేంద్రంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీఎఫ్ కేంద్రంలో సమావేశం నిర్వహించి, రాజ్యాంగం ప్రాముఖ్యతపై కమాండెంట్ నీరజ్ కుమార్ పాండే వివరించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ప్రభుత్వం రాజ్యాంగ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సెకెండ్ ఇన్ కమాండెంట్ కేసీ నిర్మల్, డిప్యూటీ కమాండెంట్‌లు నిషామోల్, సంజీవ్ ఒరా, అసిస్టెంట్ కమాండెంట్‌లు రవికుమార్, శివస్వామి, నల్లయప్పన్, సునీల్‌కుమార్ గుప్తా, డాక్టర్ శశికాంత్, జవాన్‌లు పాల్గొన్నారు.

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE :MADANAPALLE

E.P.No. 30 of 2018

O.S. No. 309 of 2012

G.S Ashok ....D.Hr.

//Vs//

N.Sathya Narayana Murthy ....J.Dr.

NOTICE

To
N.Sathya Narayana Murthy,
S/o. N. Reddeppa,
D.No. IV-2-21-B1, Krishna Nagar,
Madanapalle, Annamayya District.

The D.Hr. has filed above E.P. for attachment of sale of immovable property against you and the suit is posted to 05-12-2023 for notice under Rule 64 and youhave to appeal on that day at 10-30 a.m. before the above court for serving salenotice. You can appear in person or through advocate before the court above time failing which the matter will be decied in your absence.

Y.V.Sesha Reddy,
Sri M.V.Ramanappa
Sri L. Amarnath,
Smt. K. Afreen,
Advocates for D.Hr., Madanapalle.